




**-15-**

## పిల్లలమర్రి పినవీరభద్రుడు - సాహిత్యం

"పిల్లలమఱ్ఱి పినవీరన
కిల్లాలట వాణి యట్టులే కాకున్నన్
దెల్లముగ నొక్క రాతిరి
తెల్లగ తెలవారు వరకు తేగడె కృతిన్?" – చాటుపద్యమంజరి –1

ఈ పద్యములో వివరించిన కవి పిల్లలమర్రి పినవీరభద్రుడు తన సమకాలీనులచే వేయినోళ్ళ పొగిడించుకున్న ఘనుడు. శ్రీనాథుని రచనలకు, పెద్దన కాలానికి నడిమిన నిలచి, తన రచనలతో ఆ కాలాల మధ్య పూల వంతెనలల్లిన వాడు పినవీరభద్రుడు.

"వాణి నా రాణి" అని అతిశయముగా సగర్వముగా చెప్పుకున్నవాడు.

ఈ పిల్లలమర్రి వారింట అందరూ కవులే. పినవీరన తాత, తండ్రి, భ్రాత అందరూ 'భువనభాసురమైన కృతినిర్మాతలు'. అసలు పిల్లలమర్రి వంశమే శారదా పీఠము. తెలంగాణలోని నల్లుగొండ జిల్లాలోని పిల్లలమర్రి గ్రామము ఉంది. కాని, మన సుకవులైన పిల్లలమర్రి వంశము వారు నెల్లూరులో ఉన్నారు. గాదయామాత్యునకు, నాగాంబకు పుత్రుడితను. వీరభద్రుని అవతారమే చిన్నవీరన యని లోకులు భావించారుట. పినవీరన చిన్నతనమునే అఖిల శాస్త్రాలు అభ్యసించాడు. కాళిదాసును పూర్తిగా చదివినాడు.

"మహనీయపిల్లలమర్రి వంశభుటు గాదిరాజనుతుండు ఘనయశుండు

వీరేశ్వరని యవతారమే యతడంచు జనులెన్నదగిన సౌజన్యశాలి
పినవీరభద్రుడు పిన్నప్రాయమందు నఖిలశాస్త్రంబులు నభ్యసించె..” అంటూ ‘సీమంతినీ పరిణయం’ కర్త చెప్పినాడు కూడా.

పిల్లలమర్రి పినవీరభద్రకవి భారతీ తీర్థ యతీంద్రుల శిష్యుడు. శృంగార శాకుంతలములో తన గురుస్తుతి చేసాడు వీరన. ఆ గురువును సేవించి, సరస్వతీ మంత్రము పొందాడీ కవి. ఈయనకు గల వాణీ ప్రసాదము గురించి చాలా కథలే ఉన్నాయి.

ఇది జైమిని భారత రచనకు పూర్వము కథ. ఆ కావ్యానికి సంబంధించినది. సాళువ నరసింహరాయనికి ఒక సంవత్సరములోగా రచన ఇచ్చెదనని మాట ఇచ్చి, దాని ప్రసక్తే మరచినాడట. అన్నగారు ఎన్ని సార్లు హెచ్చరించినా వినలేదు. గడువు రేపనగా నాటి రాత్రి గదిలో గోమయముతో అలికించి, ముగ్గులు పెట్టించి, దీపము పెట్టి ధ్యాననిమగ్నుడయ్యాడట. వాణి ప్రసన్నమై, శత ఘంటములతో కావ్య రచన చేసినదట. గదిలో శతసూర్యకాంతితో వెలిగిపోతుండగా అన్నగారు గదిలోకి తొంగిచూస్తే “బావగారు వచ్చే”నని వాణి అదృశ్యమయ్యెనట. వాణి వ్రాయగా మిగిలినది వీరన వ్రాసి సభకు తీసుకుపోయినాడట. అంతవరకూ రాయనిది, ఆనాటికి రావటము చూసి మిగిలిన కవులు అడగగా “వాణి నా రాణి” అని చెప్పినాడట. కాని దీనికి రాణి అంటే భార్య అని అర్థములో కాక ‘వాఙ్మయ సామ్రాజ్య సింహాసనారూఢయైన మహారాజ్ఞి’యని కవి భావనగా విజ్ఞులు చెబుతారు.

“ప్రణవ పీఠమున మంత్ర పరంపరలు గొల్వ
నుండు నేదేవి పేరోలగంబు
భావజ్ఞులకు బరా పశ్యంతి మధ్యమా
వైఖరు లేదేవి వర్ణసరణి
జపహార కీర పుస్తక విపంచిసమంచి
తంబు లేదేవి హస్తాంభుజములు
కుందేందు మందార కందళీ బృంగంబు
చంద యైదేవి యానందమూర్తి

కాంచె నేదేవి కాంచనగర్భచతుర
పూర్వదంతక వాటవిస్ఫుటమనోజ్ఞ

చంద్రకాంత శిరో గృహస్థల విహార
మమ్మహాదేవి వాగ్దేవినభినుతింతు”...  అంటూ వాణిని ప్రార్థించినాడు. పినవీరభద్రుని యొక్క వాగ్దేవి ఉపాసనలో బలమది.

పినవీరన శైలిలో నన్నయ్యగారి ప్రబంధప్రౌఢపు బింకం, తిక్కనగారి నాటకీయ ఫక్కీ, నాచన వాచా సౌరభం, శ్రీనాథుని భాషా పరిమళం గుభాళించి ఉండేవని సమకాలీన కవులు చెప్పుకునేవారు. పినవీరన చాలా గ్రంథాలు రాసినానని చెప్పుకున్నాడు. అవి ‘అవతారదర్పణం’ ఇది దశవాతరములపై, నారదీయ పురాణము తెనుగీకరించాడు. మానసోల్లాసం, మఘమహాత్యం ఇత్యాదివి కావ్యాలు రచించినా అవి ఏవీ నేడు లభ్యమవటము లేదు.
శృంగార శాకుంతలములో ఇలా చెప్పుకున్నాడీయన–
“రచియించినాఁడను రమణీయవాగ్రీతి
నవతార దర్పణం బభినవముగ
బలినాడవు తేటపడ జేసి నారదీ
యము సత్కవిశేణి యాదరింప
జెప్పినాడవు శేముషీవిశేషంబున
మాఖమహ్యాంబు మంజుఫణితిఁ
గాంచినాడవు ఘనబుద్ధి మానసో
ల్లాససారము సముల్లసితశయ్య

భారతీతీర్థయతి సార్వభౌమగురుకృ
పాతిశయలబ్ధకవితావిభూతి గలిగి
గౌరవము గాంచినాడవు కవుల చేత
విపుల చాటూక్తినిర్ణిద్ర వీరభద్ర”. దీని మూలముగా మనకు ఆ కావ్యముల పేర్లు తప్ప మరో విషయము తెలియటములేదు.
నెల్లూరు వద్ద నున్న సోమరాజు పల్లెలో చిల్లర వెన్న మంత్రికి అంకితముగా ‘శృంగార శాంకుతలము’ వ్రాసాడు. ఈయన శృంగార శాకుంతలముకు మరో పేరు శృంగార వీరము. ఈయన సాహిత్యవీరుడు.

కాళిదాసు నాటకము ఎంతో ప్రసిద్ధమైనది. దానిని ఎవరూ అనువదించలేరు. ఆ నాటకాన్ని, నన్నయ్యగారి భారతములోని శాంకుతలోపాఖ్యానీ కూడా దృష్టిలో పెట్టుకొని శృంగార శాకుంతలమన్న కావ్యము రచించాడు పినవీరన. దీనికి శృంగార శాకుంతలమనీ, లేదా శాకుంతలా పరిణయమనీ కూడా పేరు ఉన్నది.
భారతములో కథను కొంత – కాళిదాసుని నాటక క్రమము కొంత అనుసరిస్తూ వీరన ఈ కావ్యమును రచించినాడు. దీనికి శృంగారము ప్రధాన రసము. ఇది శ్రీనాథుని శృంగార నైషదములా 'శృంగార శాకుంతలమన్న' పేర ప్రబంధముగా పేరుపొందింది.

ఈ శృంగార శాకుంతలం నాలుగు ఆశ్వాశాలలో 722 గద్యపద్యాలలో రచించినాడు.
మహాభారత మూల కథకు కొంత మార్పు చేశాడు కాళిదాసు. గర్భవతిని భర్త దగ్గరకు పంపటము, దుర్వాస శాపము, ఉంగరము చూసి గుర్తు పట్టడము ఇత్యాదివి. కాళిదాసు చేసిన ఈ మార్పులు స్వీకరించాడు పినవీరన. ఇది శృంగార ప్రధాన కావ్యము కనుక మేనకా విశ్వామిత్రుల ప్రణయాన్ని కణ్వముని శిష్యులతో చెప్పించాడు. కాళిదాసు చెప్పిన ఉంగరము, శాపము తీసుకొని, కొడుకు పుట్టాక శకుంతలను భర్త వద్దకు మూలకథానుసారం పంపాడు.
మూల కథను అనుసరించేటప్పుడు నన్నయ్యగారి మీద గౌరవము చూపించాడు పినవీరన.
తన కాలములోని ఆచార వ్యవహారాలను తన రచనలో చూపించాడు పినవీరన. పదబంధాలు, భావాలు ప్రాచీనుల వద్ద నుంచీ అర్వాచీనులు స్వీకరించటము ఉన్నదే. కాళిదాసును అనుసరిస్తూ పినవీరన కొన్ని శ్లోకాలను అలా తీసుకున్నాడు.
ప్రసిద్ధ 'అనాఘ్రాతం పుష్పం' అన్న శ్లోకానికి అనుకరణ
"కోసకొని తావి మూర్కొనని క్రొవ్విరి యెయ్యెడ వజ్రసూచిడా
యని రతజనంబుజి హ్వచవియానని తేనియ గోరు మోపి గి।
ల్లనిచిగురాకు లాలిత విలాస నికేత సమాలతాంగి దా
ననుభవకర్త యే ఘనుడో యావిధి యత్నమెరంగనయ్యెదున్॥" (శృంగారశకుంతల)

కావ్యాలలో నాటకం, నాటకాలలో శాకుంతలం, శాకుంతలములో చతుర్థాంకం, అందులో నాలుగు శ్లోకాలు రసరమ్యమని చెబుతారు. పినవీరన ఆ ఘట్టాలకు వన్నె తెచ్చాడు. కణ్వుడు పినవీరన చేతిలో పూర్తిగా తెలుగువాడైనాడు. ఆనాటి తెలుగు ఇల్లాళ్లు ఎలా ఉండేవారో మచ్చుకు–
"కంచెవయుం బటీరతిలకంబును బాపటచెందిరంబు ఫా

లాంచలసీమ లేబసువు టచ్చుతబొట్టు జెవాకు గాజులుం
గొంచెపు వీద్యము న్విరులుకొప్పున నొప్ప నొనర్ప నెప్పుడుం
జంచల నేత్ర యుండుదగు సంతత భర్తృఫలాభివృద్ధికిన్" (శాకుంతలం 4-78)
పాపిట సింధూరము ఆనాటి తెలుగు ఆడపడుచులు ధరించేవారన్నమాట. తండ్రిని వదిలి వెడుతూ శకుంతల వేతనను 'తండ్రి బాయంగలేని సంతాపజలమూ, అత్తవారింటికేగెడి ఆహ్లాదజలమూ, గోరువెచ్చనై పాలిండ్లు తడుపడపదడప పయ్యెద తుడుచుకుంటూ ' శకుంతల సాగిందట.

శృంగార శాకుంతలము తరువాత మనకు లభ్యమవుతున్న పినవీరభద్రకవివి  మరో రచన జైమినీ భారతము. ఇది సాళువ నరసింగరాయునకు అంకితమిచ్చిన రచన. సాళువ నరసింగరాయడు స్వయంగా కవి. అర్జునుని వంటి పరాక్రమవంతుడు. జైమినీ కవి పన్నెండవ శతాబ్ధములో రచించిన ఈ కావ్యములో అర్జునుని వీరము, అశ్వమేధపర్వము రచించాడు. దాన్ని తెనుగీకరించినా బాగుండునని తలచి సాళువ నరసింగడు, పినవీరభద్రుని అడిగాడు.

దీనిని పినవీరన 8 అశ్వాసాలుగా 1473 గద్యపద్యాలతో తెనుగీకరించాడు. ఇందులో నరసింగుని అర్జునినుతో పోలిక మొదలు పెట్టి కృష్ణునితో పూర్తిచేస్తాడు. ఈ కావ్యము నిండా అడుగడునా తెలుగు నుడికారపు మెరుపులు కనపడుతాయి.

ఉదా. "--- ప్రజ వేచదలంచిన గోరు చుట్టు పై
రోకటిపోటు చందంబుగ రోసి జనుల్ ననుజూచి తిట్టరే".

ఈ కావ్యములో శ్రీకృష్ణుడు, భీముడు తెగ పరాచకాలు ఆడుకుంటారు.
అది బహుశా తెలుగువారి బావా-బావమరదుల హాస్యము ఇత్యాదివి ప్రతిబింబముగా తలవవచ్చు.
కొంత ముతక హాస్యము కూడా ఈ కావ్యములో ఉంది. అది మూలలో ఉన్నదే. పినవీరనని తప్పు పట్టనక్కరలేదు.
సాయంకాలము సూర్యుడు అస్తమించాడు. సరోవరములో తామరలను హంసలు, ఏనుగులు, తుమ్మెదలు చుట్టుమట్టాయి. ఆ దృశ్యము చూచి శ్రీకృష్ణుడు రుక్మిణితో "చుచావా మగవాడు కనుమరుగు కాగానే పద్మిని పరపురుషునితో ఎలా క్రీడిస్తోందో- స్త్రీణాం చిత్తంతు చంచలమ్" అన్నాడట.
దానికి తెనుగీకరిస్తూ-

"కమలదళాక్షుడంత నిజకామిని రుక్మినితోడ నిట్లనున్
గమలిని జూచితే ప్రియుడు గన్గొనరామి మరాళసాము
భ్రమర కులంబు పైబడ గరంబుసుఖించెదు గామమెప్పుదున్
రమణునికంటె నెన్మిదిగుణంబులు గాదె లతాంగి కాయన్?" (జై.భారతం 3-67)

ఇది విని రుక్మిణి చిన్నచిన్నగా కృష్ణునికి సుద్దులు పెట్టిందట. భార్యాభర్తల మధ్య ఈ సంభాషణనను 'పరిహాసపల్లవితం బగు సల్లాపంబు' అని పినవీరన చెబుతాడు.

జైమినీభారతములో ఉపకథలు ఎన్నో ఉన్నవి.

భర్త శాపము వలన రాయిగా మారి యాగశ్వము వలన శాపవిముక్తి పొందిన భార్య కథ, పెంట మీద పడవేసిన పిండాల– ఉద్దాలకుని కథ, ప్రమీలార్జున కథ ఉన్నాయి. షష్ఠాశ్వాసంలో శ్రీరాముని యజ్ఞాశ్వాము పట్టుకున్న కుశలవుల కథ ఉంది. చంద్రహాసుని కథ కూడా ఉంది. మిగిలినవి అర్జునుని యుద్ధాల గురించే.

జైమినీ భారతములో పద్మవ్యూహము ప్రసక్తి ఉంది. పూర్వము పన్నెండు భారతీయ యుద్ధ వ్యూహాలు ఉండేవట. (వాటి గురించి క్వారిట్జ్ వేల్సు అన్న ఆయన తన Ancient South East Asian Warfare అన్న గ్రంథంలో ప్రచురించారు.)

పినవీరభద్రుడు యుద్ధాలను చూచి ఉంటాడు. అందుకే యుద్ధాలను చక్కగా వర్ణించాడు. తన రచనలలో రాజనీతిని చక్కగా చూపాడు. ఈయన తన రచనలలో తెలుగు నుడికారము పండించాడు. శ్రీనాథుని ఎంతో అనుసరించాడు పినవీరన. శ్రీనాథుని మాటలకు స్పష్టమైన అర్థాలు తెలియాలంటే పినవీరభద్రుని చదవాలని అనుకునేవారు కవులు.

పిల్లలమర్రి పినవీరభద్రకవి ప్రబంధోదయానికి శంఖారావము పూరించిన ఘనుడు, ప్రస్తానము నిర్వహించిన సూత్రధారుడు. శ్రీనాథుని తరువాత, పెద్దనను స్వాగతిస్తూ ప్రబంధ యుగానికి నాంది వాచకము పలుకుతూ నిలచిన కవితామూర్తి, విశిష్ట మూర్తి పిల్లమర్రి పినవీరభద్రుడు సాహిత్యానికి సదా కైమోడ్పులు మ్రొక్కవలసినదే.

Ref

పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి. – డా. జి.వి. సుబ్రహ్మణ్యం
ఆంధ్ర కవుల చరిత్రము. – కందుకూరి వీరేశలింగం
సమగ్ర ఆంధ్ర సాహిత్యము – ఆరుద్ర

Comments